
శుక్రవారం 24, నవంబర్ 2023
www.warangalvoice.net



- కాంగ్రెస్‌కు ఎక్కడేమీ లేదు
- ఆ పార్టీ గెలిచేది లేదు.. సచ్చేది లేదు
- బరిలో నిలిచిన అభ్యర్థులను చూడాలి..
- వారి వెనుక ఉన్న పార్టీల చరిత్రను తెలుసుకోవాలి
- లేకుంటే ఆగమైతం
- బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ హక్కుల కోసం
- ఓటర్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరిక



# కాంగ్రెస్ తుస్సుమన్నది..

**వరంగల్ వాయిస్, ములుగు/భూపాలపల్లి :** ఎన్నికలు వస్తే పార్టీకి ఒక్కరు నిలబడ్తరు..ఎవరో ఒకరు గెలుస్తరు. మిమ్ములను కోరేందంటే ఎవరు గెలిస్తే లాభం జరుగుతదో..ఎవరి చేతిలో రాష్ట్ర సుభిక్ష్యంగా ఉంటుందో ఆలోచించి నిర్ణయం తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. వ్యక్తులను చూడాలి, పార్టీలను చూడాలి, వాటి చరిత్ర తెలుసుకోవాలని బీఆర్ ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సూచించారు. బీఆర్ ఎస్ చరిత్ర మీ అందరికీ తెలుసు. ఇది మీ కండ్ల ముందే పుట్టింది. తెలంగాణ ప్రజల హక్కుల కోసమే పురుడుపోసుకుంది. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికే పుట్టింది. 15 సంవత్సరాలు రాజీలేని పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఆ తర్వాత చాలా మంచి కార్యక్రమాలు చేపట్టాం. మంచినీటి బాధ తీర్చుకున్నాం. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసుకున్నాం. పింఛన్లు, కల్యాణ లక్ష్మిని పెంచుకున్నాం. ముఖ్యంగా బీఆర్ ఎస్ మూడో సారి అధికారంలోకి రాగానే పింఛన్ రూ.3వేలు చేస్తుంది. దానిని అంచెలంచెలుగా రూ.5వేలు చేసుకుందాం. రైతులకు మంచి పనులు చేశాం. కాలువల ద్వారా వచ్చే నీటికి అన్ని రాష్ట్రాల్లో పన్ను వేస్తరు. కాని మన రాష్ట్రంలో దానిని రద్దు చేశాం. 24 గంటలు నాణ్యతతో కూడిన కరెంటు ఇస్తున్నాం. పండించిన పంటలను కొంత నష్టమైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొంటున్నామని కేసీఆర్ ప్రకటించారు.

## జిల్లాలు ఇచ్చిందే కేసీఆర్..

ఎన్నడన్న ఇక్కడి ప్రజలు ములుగు, భూపాలపల్లి మండలాలు జిల్లా కేంద్రాలుగా మారుతాయని అనుకున్నారా..ఇక్కడికి మెడికల్ కళాశాల వస్తదని కలగన్నారు. వాటన్నింటినీ బీఆర్ ఎస్ ప్రభుత్వం సాధించి చూపించింది. మెడికల్ కళాశాలతోపాటు ములుగు, బూపాలపల్లిలో 400 పడలక ఆస్పత్రి, నర్సింగ్ కళాశాలలు కూడా త్వరలోనే వస్తాయన్నారు. అప్పుడు మారు ప్రాంతాలకు కూడా మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణలోని ఏ ఊరు అయినా, ఏ పల్లె అయినా బాగుపడాలని కేసీఆర్ కోరుకుంటాడన్నారు. తెలంగాణ ప్రజలు తలెత్తుకొని తిరుగాలి కాని జారి పడొద్దని హెచ్చరించారు.

## నాగజ్యోతి, రమణారెడ్డిని గెలిపించండి..

రైతు బందును పుట్టించిందే బీఆర్ ఎస్ ప్రభుత్వం. దురదృష్ట వశాత్తు రైతు చనిపోతే రూ.5లక్షలు వారంలోపే బీమా పంపిస్తున్నాం. పండించిన వడ్లను వంద శాతం కొట్టున్నాం. పనిలేని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు కేసీఆర్ కు పనిలేదు. వేస్టుగా రైతు బందు ఇస్తున్నాడంటూ ప్రచారం చేస్తున్నారు. రైతు బందు వేస్టా..అంటూ కేసీఆర్ ప్రశ్నించారు. రైతుబందు ఉండుడే కాదు తిరిగి అధికారంలోకి రాగానే దానిని రూ. 16వేలకు పెంచుకుంటామన్నారు. ఇప్పటి పీసీసీ పెసిడెంట్ రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే చాలంటున్నాడు. సరిపోతదా..ఎన్నిగంటలు ఉండాలే అంటూ ప్రశ్నించారు. ఇవన్నీ కావాలంటూ తిరిగి బీఆర్ ఎస్ అధికారంలోకి రావాలన్నారు. నాగజ్యోతి, రమణారెడ్డిని గెలిపిస్తేనే రైతు ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు.

## కత్తి ఒకరికి ఇచ్చి..

కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం మరొకరిని చేయమంటే చేస్తరా.. ఎవరైతే ప్రజల పక్షాణ పోరాడుతారో వారి చేతిలోనే కత్తి పెట్టాలి..అప్పుడే గ్యారెంటీగా మేలు జరుగుతుందని కేసీఆర్ అన్నారు. ధరణి తీసి బంగాళాఖాతంలో వేస్తామంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ధరణి తీసివేస్తే రైతుబంధు డబ్బులు ఎలా వస్తాయన్నారు. మీకు ఎంత భూమి ఉన్నదో లెక్కతీసి అక్కడ నిధులు విడుదల చేస్తే మీ బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడుతున్నాయని గుర్తు చేశారు. మీ సెల్ ఫోన్‌లు టింగ్ టింగ్ మని మోగుతున్నాయన్నారు. మీరు పోయి చూసుకుంటే డబ్బులు ఉంటున్నాయని, వాటిని మీరు పెట్టుబడికి వాడుకుంటున్నారన్నారు. ధరణి తీసేస్తే రైతు బందు ఎట్లా వస్తదని ప్రశ్నించారు. ఏ పద్ధతిలో వస్తయని ప్రశ్నించారు. మళ్లీ పైరవీలు, దళారీలు, ముడుపుల రాజ్యం వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వంద శాతం దళారుల రాజ్యం గ్యారెంటీ అన్నారు. రైతులు జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలంటూ హెచ్చరించారు. లేకుంటే పెద్ద ప్రమాదం జరుగుతుందన్నారు. గతంలో సింగరేణి మనకే ఉండేది. సింగరేణిని కూడా ముంచింది కాంగ్రెస్ పార్టీనే. వారికి చాతకాక కేంద్ర ప్రభుత్వం దగ్గర అప్పులు తెచ్చి కట్టలేక వారికి 49శాతం వాటా కట్టబెట్టిందని విమర్శించారు. దీంతో ఇవ్వాల సగం వాటా కేంద్రానికి ఇవ్వాల్సి వస్తుందన్నారు. ఇదే కాంగ్రెస్ నాయకులు డిపెండెంట్ ఉద్యోగాలు వద్దని సంతకాలు పెట్టారని ఆరోపించారు. బీఆర్ ఎస్ వచ్చిన తర్వాత దానిని పునరుద్దరించామన్నారు. 15వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కూడా ఇచ్చుకున్నామన్నారు.

## రమణారెడ్డి గెలుపు ఖాయమైంది..

వర్షంలోనూ బహిరంగ సభకు ఇంత మంది వచ్చారంటూ గండ్ర వెంకటరమణా రెడ్డి గెలుపు ఖాయమైపోయిందని కేసీఆర్ అన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో హాజరైన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 30వ తేదీన ఇదే స్ఫూర్తితో ఓటు వేసి రమణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రమణారెడ్డి కోరిన కోర్కెలు వంద శాతం తీర్చే బాధ్యత నాదంటూ కేసీఆర్ హామీ ఇచ్చారు. భూపాలపల్లికి మేలు జరుగాలంటే రమణారెడ్డి గెలిచి తీరాలన్నారు.

## రెండు రోజులు ములుగులోనే ఉంటా..

ములుగులో అభివృద్ధి కావాలంటే గవర్నమెంట్ లో ఉన్న పార్టీ అభ్యర్థి గెలుస్తేనే ఎక్కువ పనులు జరుగుతవన్నారు. గతంలో ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే ఒక్కసారి కూడా మమ్ములను కలిసింది. ప్రజలకు కావాల్సినవి చెప్పంది లేదన్నారు. మేమే ప్రజల అవసరాలను గుర్తించి అన్ని ఇచ్చామన్నారు. ఇప్పుడు నాగజ్యోతిని దీవించి గెలిపిస్తే రెండు రోజులు ఇక్కడే ఉండి అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు బీఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గండ్ర వెంకటరమణా రెడ్డి, నాగజ్యోతి, మంత్రి సత్యవతి రాథోడ్, శాసన మండలి చైర్మన్ బండా ప్రకాష్, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి, జడ్పీ చైర్మన్, వాసుదేవరెడ్డి, బుర్ర రమేష్, నర్సింహరావు, పైడిపల్లి రమేష్, భారతక్క తదితరులు పాల్గొన్నారు.



